క్లుప్తంగా

సీఎం ముస్లింల సంక్షేమానికి కృషి


ఎస్.మూర్తుజావలిని సత్కరిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముస్లింల సంక్షేమానికి అంకితభావంతో కృషి చేస్తున్నారని నూతనంగా ఎన్నికైన ఉర్దూ అకాడమి సభ్యుడు మూర్తుజావలీ, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్ ఖాజా హుసేన్ తెలిపారు. శుక్రవారం బేతంచెర్ల ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మహబూబ్‌వలీ, సద్దాం అలీబేగ్, ఉపాధ్యాక్షుడు శ్రీషావలీ, ట్రెజరర్ దస్తగిరి సభ్యుల ఆధ్వర్యంలో మూర్తుజావలీ, ఖాజా హుసేన్‌ను ఘనంగా సత్కరించారు. ముస్లిం సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఈ సందర్భంగా వారు వివరించారు. కార్యక్రమంలో సభ్యులు సికిందర్ అలీ, దాదాఖలందర్, అక్తాబ్, మహబూబ్, వలీ, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

డోన్ టౌన్: మండలంలోని గుమ్మకొండ సమీప కొండల్లో వెలసిన శ్రీబంగారుకొండ పాతపాలెం అభయ ఆంజనేయస్వామికి శుక్రవారం భక్తులు ప్రత్యేక నిర్వహించారు. వైశాఖ మాసం జేష్ఠ అమవాస్య, శని జయంతిని పురష్కరించుకొని ఉదయం ప్రాతకాల పూజలు, పంచామృతాభిషేకాలు, తమలపాకుల తోరణాలతో సింధూర కుంకుమ తిలకంతో ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

బ్రాహ్మణ సంఘం అధ్యక్షునిగా శంకర్‌శర్మ


నంద్యాల శంకర్‌శర్మ

డోన్ : నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం నూతన అధ్యక్షునిగా పట్టణానికి చెందిన నంద్యాల శంకర్‌శర్మ ఎన్నికయ్యారు. ఈ మేరకు సంఘం సభ్యులు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో అధ్యక్ష బాధ్యతలు నిర్వహించిన కస్తూరి మూర్తి విదేశాలకు వెళ్లినందున నూతన అధ్యక్షుని నియామకం జరిగిందని వారు తెలిపారు. శంకరశర్మ ఎన్నికపై సంఘం నాయకులు సుగుణాకరరావు, నరసింహారావు, రాఘవేంద్రరావు, స్వరూప్, పోస్టల్ రామారావు, సుజాత, సుధీంద్ర తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా అమావాస్య పూజలు


గాడుబావి వీరాంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేటలో వెలసిన గాడు బావి వీరాంజనేయస్వామి, గౌరి పేటలో వెలసిన ఆంజనేయ స్వామి, పలక చింత మాను, కనుమ ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం వైశాఖ మాస అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా బనగానపల్లె రహదారిలోని పుట్ట పెద్దమ్మ ఆలయంలో నిర్వాహకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తులు పూజలు చేశారు.

21 నుంచి విష్ణు సహస్ర నామ పారాయణం

బేతంచెర్ల: పట్టణంలోని పూదోట ఆశ్రమంలో ఈనెల 21 నుంచి జూన్ 30 వరకు 41 రోజుల పాటు విష్ణు సహస్రనామ స్తోత్ర అఖండ మండల సామూహిక పారాయణం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ కమిటీ సభ్యులు గుండా గోపాలు, ఈశ్వర్ ప్రసాద్, గౌరి హుసేన్‌రెడ్డి, రామకృష్ణ, నాగ మోహన్, డాక్టర్ నరసింహులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పూదోట ఆశ్రమం ఆవరణలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను సభ్యులు విడుదల చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న దృశ్యం

అవుకు: పట్టణానికి చెందిన ముదిగేడు బాల సుబ్బయ్య మృతి చెందటంతో బాధిత కుటుంబాన్ని అవుకు బలిజ సంఘం పెద్దలు శుక్రవారం పరామర్శించారు. మృతదేహానికి పూల మాలను వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు దంతెల రమణ, జక్కా మధు,శనగల వెంకటేశ్వర్లు, మామిళ్ల సుబ్బన్న, గుర్రాల రామాంజనేయులు, గాజుల కృష్ణ కుమార్, చిన్న కంబగిరి స్వామి, జయరాముడు, ఉపేంద్ర, కోనేటి రవి, కడప భాస్కర్, రామ్రకిష్ణ, కునుకుంట్ల హరి తదితరులు పాల్గొన్నారు.

భానుడు... భగభగ!

- పది రోజులుగా మండుతున్న సూర్యుడు
- బుసలుకొడుతున్న సెగ
- జాగ్రత్తలు పాటించాలంటున్న డాక్టర్లు

కోవెలకుంట్ల: భానుడు భగభగమంటున్నాడు. ప్రత్యేకించి పది రోజుల నుంచి సూర్యుడు మండిపోతున్నాడు. వాతావరణంలో పెను మార్పులు చోటు చేసుకున్నాయి. ఆ ప్రభావం ఉష్ణోగ్రతలపై పడి సూర్యభగవానుడు ప్రతాపాన్ని చూపుతున్నాడు. దీంతో వేసవి సెగలు బుసకొడుతున్నాయి. జిల్లాలో ఇటీవల కాలంలో ప్రతి రోజు 40 డిగ్రీల పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భానుడు భగభగమంటున్నాడు. ఉదయం పది గంటలకే రోడ్లు ఖాళీగా మారుతున్నాయి. కోవెలకుంట్ల, సంజామల, బండిఆత్మకూరు, నంద్యాల తదితర ప్రాంతాల్లో వడదెబ్బబారిన పడి పలువురు మృత్యువాత పడ్డారు. ఎండలతో ప్రజల ఆరోగ్యం సన్నగిల్లుతోంది. చలికాలం తర్వాత ఎండాకాలం రోగాలకు సీజన్‌గా మారింది. ఎండ తీవ్రత కారణంగా శరీర ఉష్ణోగ్రతలు పెరిగి మెదడు మీద ప్రభావం పడుతోంది. దీనివల్ల మెదడులోని ఉష్ణోగ్రతను నియంత్రించే కేంద్రం(హైపో థలామస్) దెబ్బతింటోంది. వేసవి ప్రమాదం నుంచి రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు డాక్టర్లు.

లక్షణాలు, కారణాలు

- చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం
- వణుకు పుట్టడం, మగత నిద్ర లేదా కలవరింత
- ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారకస్థితి
- శరీరంలో ఎక్కువ వేడి, శరీరం ఉష్ణాన్ని కోల్పోవడం

శరీరంలో కలిగే మార్పులు:

- వేడి వల్ల చెమట పట్టి శరీరంలోని లవణాలు(సోడియం క్లోరైడ్) తగ్గిపోతుంది. లేదా శరీరంలోని నీటి నిష్పత్తి తగ్గుతుంది
- ఉష్ణోగ్రత ఉన్న ప్రదేశాల్లో ఎక్కువగా శ్రమతో కూడిన పని చేస్తున్నప్పుడు ప్రతి గంటకు 3–4 లీటర్ల నీటిని చెమట రూపంలో శరీరం కోల్పోతుంది.

వడదెబ్బకు ఎక్కువగా గురయ్యే వక్తులు:

- 65 ఏళ్ల పైబడిన వ్యక్తులు
- గర్భిణులు, పాలిచ్చే తల్లులు, పసిపిల్లలు
- అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులు(అధిక రక్త పోటు, గుండె జబ్బులు)

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- తలకు టోపీ లేదా రుమాలు, గొడుగు వాడాలి
- వేడి తగలకుండా చూసుకోవాలి
- తెలుపురంగు, పలచటి చేనేత వస్త్రాలను ధరించాలి
- ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య కాలంలో ఆరుబయట అధిక శారీరక శ్రమతో కూడిన పని చేయకుండా ఉండాలి
- గొంతుకు సంబంధించిన అనారోగ్య సమస్యలు తలెత్తికుండా శీతల పానీయాలు తీసుకోవాలి
- ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు ఒక గ్లాసు మంచినీరు తాగాలి. వీలైనన్ని సార్లు తాగడం మంచిది.
- ఎండలో తిరిగే సమయంలో చల్లని నిమ్మరసం, కొబ్బరినీరు, చల్లని మంచినీరు తాగాలి
- తీవ్రమైన ఎండలో బయటకు వెళ్లినప్పుడు తల తిరగడం తదితర అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

ప్రథమ చికిత్స ఇలా:

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ప్రదేశానికి చేర్చాలి
- చల్లని నీటితో ముంచిన తడిగుడ్డతో ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకు తుడవాలి.
- వడదెబ్బ తగిలిన వ్యక్తిని ఫ్యాను గాలి లేదా చల్లని గాలి తగిలే ప్రదేశంలో ఉంచాలి
- ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ ద్రావణం, ఓఆర్ఎస్(ఓవర్‌రీ హైడ్రేషన్) ద్రావణాన్ని తాగించాలి
- వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదు. వీలైనంత త్వరగా వైద్యుడి వద్దకు తీసుకెళ్లాలి.


ఎండ తీవ్రతతో కోవెలకుంట్లలో నిర్మానుష్యంగా మారిన ప్రధాన వీధి

అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం



వేసవికాలం కావడంతో ఇటీవల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వడదెబ్బబారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అవసరమైన వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నాం. అవసరమైతే తప్ప ఇళ్లలో నుంచి బయటకు రాకూడదు. ప్రత్యేకించి వృద్ధులు, గర్భిణులు, చిన్న పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వ్యక్తులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండ తీవ్రత కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తితే తక్షణం వైద్యులను సంప్రదించాలి. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా పొందవచ్చు. – డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సీహెచ్‌సీ ఇన్‌చార్జ్, కోవెలకుంట్ల

వైఎస్సార్ బీమా సాయం అందజేత

బేతంచెర్ల: మండల పరిధిలోని రహిమానుపురం గ్రామానికి చెందిన వై. శివశంకర్ రెడ్డి (40) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. ఈ మేరకు వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ. 10 వేలు మృతుని భార్య సులోచనకు మంగళవారం కార్యదర్శి రంగస్వామి, వెల్ఫేర్ అసిస్టెంట్ షాహీణ, గ్రామ వైఎస్సార్ నాయకుడు శ్రీనాథ్‌రెడ్డితో కలిసి సర్పంచ్ ప్రమీలమ్మ అందజేశారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొలిమిగుండ్ల: 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి మోడల్ స్కూల్‌లో ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఇంద్రసేనారెడ్డి శుక్రవారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ.150 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈనెల 22 నుంచి జూన్ 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంగ్లిష్ మీడియంలో బోధన జరుగుతుందని, పది పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ

డోన్ టౌన్ : మండల పరిధిలోని కన్నపకుంటలో శుక్రవారం పర్యావరణ పరిరక్షణనపై ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారెస్టు రేంజర్ భారతి, సర్పంచ్ కళ్యాణి మాట్లాడారు. ప్లాస్టిక్‌ను ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా నిషేధించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా మొక్కల పెంపకం ప్రయోజనాలను వివరించారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న, ప్రజా ప్రతినిధులు, అధికారులు

బేతంచెర్ల: పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా సీఎం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని శంకలాపురం గ్రామంలో శుక్రవారం ఎంపీడీఓ వెంగన్న, గ్రామ సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి తిరుమలేశ్వర్ రెడ్డి, గ్రామ నాయకులు జిల్లా వ్యసాయ సలహా మండలి సభ్యులు జయప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, న్యాకులు ఇంటిటికీ వెళ్లి ప్రభుత్వం నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను, గ్రామంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు ఏర్పాటు చేయాలని, గృహాలు మంజూరు చేయాలని ఆయా కాలనీల ప్రజలు విన్నవించారు. ప్రాధాన్యత మేరకు మౌలిక వసతులు కల్పిస్తామని, అర్హులందరికీ గృహాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో అన్ని గ్రామాల ను ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ కృష్ణ, మద్దిలేటి స్వామి చైర్మన్ రామ చంద్రుడు, సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ, వైఎస్సార్ నాయకులు రమణారెడ్డి, శేషిరెడ్డి, కొండారెడ్డి, బ్రహ్మం, తిరుపాల్ రెడ్డి, గూని నాగరాజు, శేఖరయ్య, నాగేశ్వరరావు, తిరుమలేశ్వర్ రెడ్డి, ఎద్దులన్న, గోరుమానుకొండ, సీతారామాపురం సర్పంచ్‌లు వేణుగోపాలు రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పేదల వ్యతిరేకి చంద్రబాబునాయుడు

- బాబు అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణుల నిరసన ర్యాలీ


నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

డోన్ : పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సెంటు భూమిలో సమాధులు కట్టుకోవాలా అంటూ చంద్రబాబునాయుడు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసిస్తూ శుక్రవారం పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహం నుంచి ప్రారంభమైన ర్యాలీకి రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ నాయకత్వం వహించారు. కోర్టు, పోలీసు స్టేషన్, పాతబస్టాండ్ వరకు సాగిన ఈ ర్యాలీలో పెద్దఎత్తున నాయకులు, కార్యర్తలు పాల్గొన్నారు. చంద్రబాబుకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేయడంతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. పాతబస్టాండ్‌లో జరిగిన సభలో శ్రీరాములు మాట్లాడుతూ పేదల వ్యతిరేకి చంద్రబాబు అని అన్నారు. నిరుపేదల సంక్షేమం కోసం ఏనాడూ ఆలోచన చేయని బాబు అమరావతిలో ఇంటి పట్టాల విషయంలో విషం కక్కుతూ తన నిజస్వరూపాన్ని బయటపెట్టుకున్నారని విమర్శించారు. 14 ఏళ్ల రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు పేదలకు ఏనాడైనా సెంటు భూమిని మంజూరు చేశారా అని నిలదీశారు. చంద్రబాబు చేస్తున్న వ్యాఖ్యలు, మాట్లాడుతున్న తీరు పేదప్రజలపై ఆయనకు ఉన్న వ్యతిరేకతను స్పష్టం చేస్తుందని, మరోమారు తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోస్టుపాడ్, సోషల్ మీడియా కన్వీనర్ దినేష్‌గౌడ్, గృహసారథుల పట్టణ కన్వీనర్ కురుకుందు హరి, మున్సిపల్ వైఎస్ చైర్మన్ జాకీర్ హుసేన్, రాయలసీయమ యూనివర్సిటీ క్లస్టర్ మెంబర్ నాగభూషణంరెడ్డి, నాయకులు మల్యాల శ్రీనివాసరెడ్డి, ఆర్‌ఈ రాజవర్ధన్, కొచ్చెర్వు మధురెడ్డి, సోంపురం వేమారెడ్డి పాల్గొన్నారు.

నియామకం


ఐఏఎల్ రాష్ట్ర కార్యదర్శి రాగుల రాముడు


ఐఏఎల్ ఈసీ సభ్యుడు శివరామకృష్ణ

డోన్ : భారత న్యాయవాదుల సంఘం(ఐఏఎల్) రాష్ట్ర కార్యదర్శిగా డోన్‌కు చెందిన రాగుల రాముడు, ఈసీ సభ్యునిగా పి.శివరామకృష్ణ ఎన్నికయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఐఏఎల్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చలసాని అజయ్‌కుమార్, సురేష్ ఓ ప్రటన విడుదల చేశారు. ఐఏఎల్‌లో డోన్ న్యాయవాదులకు సముచిత స్థానం లభించడంపై సీనియర్ న్యాయవాదులు వేణుగోపాల్‌గౌడ్, శ్రీరాములు, రాఘవేంద్ర గౌడ్, మద్దయ్య, బొంకూరి రవికుమార్, పీవీ రంగారెడ్డి, జీవనబాబు, సుంకన్న, రవిమోహన్ హర్షం వ్యక్తం చేశారు.

వలంటీర్లకు పురస్కారాలు ప్రదానం


వలంటీర్‌కు పురస్కారం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలను నేరుగా పేదప్రజల దరికి చేరుస్తున్న వలంటీర్లను ప్రభుత్వం ప్రతి ఏటా సత్కరించడం హర్షణీయమని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం చైర్మన్ ఆధ్వర్యంలో అత్యుత్తమ సేవలు అందజేసిన వలంటీర్లకు ప్రభుత్వం ప్రకటించిన సేవామిత్ర, సేవారత్న, సేవా వజ్రల అవార్డులు, రూ.10వేలు, రూ.20వేలు, రూ.30వేల నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డోన్ పట్టణ పరిధిలో 268 మంది వలంటీర్లు ఉండగా, సేవా మిత్రకు 233, సేవా రత్నకు 5, సేవా వజ్ర పురస్కారానికి ఇద్దరు వలంటీర్లు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, కౌన్సిలర్లు ధారా హరినాథ్‌రెడ్డి, పాలుట్ల మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈఓ విచారణ


హెచ్‌ఎంను విచారిస్తున్న డిప్యూటీ డీఈఓ క్రిష్టపర్

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం జెడ్పీ హైస్కూల్‌కు గతంలో ఎంపీ ఎస్పీవై రెడ్డి సహకారంతో మంజూరైన రూ. 4 లక్షల విలువ డెస్కులను హెచ్‌ఎం అమ్ముకున్నారన్న సీపీఐ నాయకుల ఫిర్యాదు మేరకు శుక్రవారం డిప్యూటీ డీఈఓ క్రిష్టపర్ విచారణ చేపట్టారు. డెస్కులు అమ్మిన విషయం వాస్తవమేనని, అయితే ఆ సొమ్మును స్కూల్ అభివృద్ధికి ఖర్చు చేశానని హెచ్ఎం విక్టర్ ఇమ్మానీయేలు అంగీకరించినట్లు డిప్యూటీ డీఈఓ తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. హెచ్‌ఎం చేసిన తప్పును ఒప్పుకున్నందున వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి భార్గవ్ డిమాండ్ చేశారు.

నాడు నేడు పనులపై సమీక్ష

డోన్ టౌన్: మండలంలో జరుగుతున్న నాడు నేడు మన బడి పనులపై స్థానిక గర్ల్స్ హైస్కూల్లో శుక్రవారం హెచ్‌ఎంలు, సచివాలయం ఇంజినీర్లతో ఎంఈఓ ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. పాఠశాలల వారీగా వివరాలు సేకరించిన ఎంఈఓ సమస్యలపై చర్చించి పరిస్కార సూచనలు చేశారు. జూన్12 నాటికి అన్ని పనులను పూర్తి చేయాలని ఎంఈఓ సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్/ప్యాపి: ప్యాపిలి మండలంలోని నల్లమేకలపల్లి 33 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో శనివారం కొచ్చెర్వు, హుస్సేనాపురం, పీఆర్ పల్లి గ్రామాల సబ్ స్టేషన్ల పరిధిలోఇ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు రూరల్ ఏఈ నాగేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సబ్ స్టేషన్ మరమ్మతుల మూలంగా పట్టణంతోపాటు యు.కొత్తపల్లె సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, అలాగే ఇండస్ట్రీయల్, వాటర్ వర్క్స్ ఫీడర్ల మరమ్మతులు చేస్తున్నందున కన్నపకుంట, చింతలపేట, గోసానిపల్లె గ్రామాలతో పాటు ఫ్యాక్టరీలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు కరెంటు ఉండదన్నారు. వ్యవసాయానికి తెల్లవారు జామున 5 నుంచి విద్యుత్ సరఫరా చేస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు.

బనగానపల్లెలో...

బనగానపల్లెరూరల్: మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రూరల్ ఏఈ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. బనగానపల్లె, పాతపాడు, పసుపల సబ్ స్టేషన్లలో మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

బేతంచెర్లలో...

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్‌లో విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఆర్‌ఎస్ రంగాపురం గ్రామం మినహా మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ మధుసూధన్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి


సంజామల స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

సంజామల: అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృషిసారించాలని, ఎంతటివారైనా ఉపేక్షించొద్దని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి పోలీసులకు సూచించారు. సంజామల పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. స్టేషన్ పరిసరాలతో పాటు లాకప్ గదులు, కొత్తగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించే బాధితులపట్ల మర్యాదగా వ్యవహరించాలని, సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వేసవిలో చోరీలు జరిగేందుకు అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన దిశ యాప్ వారికి అవగాహన కల్పించి డౌన్‌లోడ్ చేయించాలన్నారు. మట్కా, పేకాట, అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపాలన్నారు. స్టేషన్ రికార్డుల పని తీరు బాగుందని ఎస్‌ఐ ప్రతాప్‌ను అభినందించారు. ఎస్పీ వెంట ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకటరామయ్య, కోవెలకుంట్ల సీఐ నారాయణరెడ్డి ఉన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి


రక్తదాతకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న శేషయ్య

డోన్ టౌన్: సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పట్టణ సీఐ పెనుగొండ శేషయ్య పిలుపునిచ్చారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురష్కరించుకుని స్థానిక ఎస్కేపీ హైస్కూల్ గ్రౌండ్‌లో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సీఐ ప్రారంభించారు. కర్నూలు రెడ్ క్రాస్ సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. ముందుగా పుచ్చలపల్లి చిత్రపటానికి సీపీఎం నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రక్తదానం చేసిన దాతలకు సీఐ ప్రశంసా పత్రాలు, పండ్లు అందజేశారు. తలసేమియా బాధిత చిన్నారుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని ఈ సందర్భంగా సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శివరాం, నక్కి శ్రీకాంత్, రామాంజనేయులు, కొయిలకొండ నాగరాజు, నాగన్న, సుధాకర్, బాలమద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగుబోతు వీరంగం... ఒకరికి గాయాలు

డోన్ టౌన్: పట్టణంలోని బేతంచెర్ల సర్కిల్‌లో శుక్రవారం రాత్రి తాగిన మైకంలో ఒక వ్యక్తి వీరంగం సృష్టించాడు. కనబడిన వారిపై దాడి చేస్తూ భయభ్రాంతులకు గురిచేశాడు. ఎల్లకృష్ణ, శివలక్ష్మీ దంపతుల తోపుడు బండ్లలోని కాటారాళ్లను తాగుబోతు తీసుకునేందుకు ప్రయత్నించగా వారు అడ్డుకున్నారు. దీంతో వారిపై దాడికి పాల్పడ్డాడు. ఎల్లకృష్ణకు తలపై బలమైన గాయం కాగా ఆయన భార్య శివక్ష్మికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు విచారణ చేపట్టారు.

పాలుట్ల రంగస్వామి హుండీ ఆదాయం రూ.2,95,595

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామ సమీపాన వెలసిన పాలుట్ల రంగస్వామికి భక్తులు సమర్పించిన కానుకులు, ముడుపుల హుండీ లెక్కింపు శుక్రవారం నిర్వహించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షణలో 17 నెలలకు సంబంధించిన కానుకల హుండీ లెక్కించారు. రూ.2,95,595 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ మద్దిలేటి తెలిపారు.

22 నుంచి ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరణ

బనగానపల్లెరూరల్: పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చేరేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఎంపీసీ, ఎంఈసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయని, 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ నెల 22వ తేదీ నుంచి జూన్ 6వ తేది వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ. 200లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

మూగ జీవాలకు మెరుగైన వైద్య సేవలందించాలి

బనగానపల్లెరూరల్: పశు వైద్య సంచార వాహన సిబ్బంది మూగజీవాలకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సూచించారు. రాష్ట్రంలో పశువైద్య సంచార వైద్య సేవలు ప్రారంభించి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే స్థానిక స్వగృహంలో పశు వైద్యసంచార వాహన వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో కాటసాని కేక్ కట్ చేశారు. అంకిత భావంతో సేవలందిస్తున్నారని సిబ్బందిని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిదర్శనం


సీసీ రోడ్డుపై నిల్వ చేరిన మురికినీరు(నాడు)


కొత్తగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు(నేడు)

కొలిమిగుండ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఏళ్లతరబడి పరిష్కారానికి నోచుకోని సమస్యలు సైతం తీరుతున్నాయి. మండల పరిధిలోని గొర్విమానుపల్లెలో ప్రధాన సీసీ రోడ్డు గతంలో అస్తవ్యస్థంగా ఉండేది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చొరవ తీసుకొని అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. స్పందించిన యాజమాన్యం రూ.35లక్షలకు పైగానే సీఎస్ఆర్ నిధులతో 250 మీటర్ల సీసీ రోడ్డు, 500 మీటర్ల డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టి ఇటీవలనే పూర్తి చేశారు. ఆంజనేయస్వామి ఆలయం, ఎస్సీ కాలనీ సమీపంలో మురికినీరు రోజుల తరబడిగా నిల్వ ఉంటుండేది. ప్రజలు ఆ నీటిలోనే రాక పోకలు సాగించేవాళ్లు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక సీసీ రోడ్డుపై మురికినీళ్లు పారుతుండేవి. ఎట్టకేలకు కొత్తగా సీసీ రోడ్డుతో పాటు ఇరువైపులా డ్రైనేజీ ఏర్పాటు చేయడంతో గ్రామస్తుల కష్టాలు తొలగిపోయాయి.